తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ముథోల్, మార్చి 7 : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివ కుమార్ అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా ముథోల్‌లోని గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడారు. తాగునీటి సమస్య ఉన్నట్లయితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. తక్షణమే వాటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే గ్రామ సమస్యలపై చర్చించారు. గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి అన్వర్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

దస్తురాబాద్, మార్చి 7 : విద్యార్థులకు చదవుతో పాటు క్రీడలు ముఖ్యమని మండల విద్యాధికారి గంగాధర్ అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం ఆకొండపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్పోర్ట్స్ నిధుల సహాయంతో తీసుకున్న ఆట వస్తువులను శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, ఉపాధ్యాయులు భాస్కర్, అనిల్, సీఆర్పీ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి వెంటకరమణ పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తులకు కూలర్లు పంపిణీ

ఎదులాపురం, మార్చి 7 : ఆదిలాబాద్‌లోని లెప్రసీ కాలనీలో ఆదిత్య కండేక్టర్ సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య వ్యాధిగ్రస్తులకు ఆరు చైర్లు, సరుకులు, కూలర్లు అందజేశారు. వారి ఆరోగ్య సమస్యలతో పాటు ఇతర ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండ వేడిమి నుంచి రక్షణ పొందేలా లెప్రసీ కాలనీలో కూలర్లు అందించడం జరిగిందన్నారు. వీరికి ఇతర సౌకర్యాలు కల్పించేలా తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

భైంసా, మార్చి 7 : నిర్మల్ జిల్లా భైంసాలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు భైంసా న్యాయమూర్తి దేవేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్ కేసులతో పాటుగా రాజీ పడదగిన క్రిమినల్, వాహన ప్రమాదాలు, బ్యాంకు రికవరీ, చెక్‌బౌన్స్, భూ వివాదాలు వంటి కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఇచ్చోడ, మార్చి 7: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని కేజీబీవీలో శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు హెల్త్ ప్రొఫైల్ కార్యక్రమం నిర్వహించారు. 66 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి వారి నుంచి రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపించినట్లు డాక్టర్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ బీ నరేశ్, మధురిమ, ఎస్‌వో మల్లిక, ఎల్‌టీ పరమేశ్వర్, ఫార్మాసిస్టు అరుణ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ఇచ్చోడ, మార్చి 7 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో ఉపాధి హామీ పథకంలో భాగంగా కొనసాగుతున్న పొలంబాట మట్టి రోడ్డు పనులను శుక్రవారం ఎంపీడీవో లక్ష్మణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఇంద్రవెల్లి, మార్చి7: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ముత్నూర్, ఇన్‌కర్‌గూడతో పాటు ఎంపీడీవో కార్యాలయం నుంచి కొబ్బుయిగూడ వరకు మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల లబ్ధిదారుల ఎంపిక

బేల, మార్చి 7: ఆదిలాబాద్ జిల్లా బేలలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం దివ్యాంగుల లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. 62 మంది అర్హుల దరఖాస్తు చేసుకోగా గూడ గ్రామానికి చెందిన వైద్య ఆకాశ్ లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. రూ.50 వేలు వంద శాతం రాయితీతో రుణం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్ కుమార్, టైపిస్ట్ మతిన్, జూనియర్ అసిస్టెంట్ శశికిరణ్, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సంతోష్, ప్రధాన కార్యదర్శి రవి పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

నిర్మల్ అర్బన్, మార్చి 7: నిర్మల్ కలెక్టర్ కార్యాలయ సమీపంలోని ఈవీఎం గోదాంను శుక్రవారం కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. పలు రాజకీయ పార్టీల నేతలతో పరిశీలించగా ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం మెరుగైన భద్రతను నిర్వహించాలని షిఫ్టుల వారిగా భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. ఇక్కడ ఆర్డీఓ రత్న కళ్యాణి, ఎన్నికల పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఆయా పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

మల్లక్‌చించోలిలో వైద్యశిబిరం

సారంగాపూర్, మార్చి 7: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని మల్లక్‌చించోలిలో శ్రీ చందన దవాఖాన ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వరం, దగ్గు, బీపీ, షుగర్ రోగులను పరీక్షించారు. అలాగే రోగులకు రక్తపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దుర్గాప్రసాద్, దవాఖాన మేనేజ్‌మెంట్ వల్లకొండ సురేశ్, సతీశ్‌కుమార్, మైస శేఖర్, బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సమస్యల సాధనకు చట్టాలు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి7 : అన్ని రాష్ట్రాల్లో ఉన్న బీఎంస్, బీపీటీఎం నాయకుల ఆధ్వర్యంలో కార్మిక సమస్యల సాధనకు చట్టాలు చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కారికి మహారాష్ట్రలోని నాగపూర్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ బీఎంఎస్ తరపున నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ బీఎంఎస్ ఆదిలాబాద్ జోనల్ ఇన్‌చార్జి, టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకరి శివకుమార్, నాయకులు ఉన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కుంటాల, మార్చి 7 : మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యాసంవత్సరానికి ఆరు నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్ల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తు తేదీని ఈ నెల 20 వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ కాసు నవీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఎదులాపురం: మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య

ఎదులాపురం, మార్చి 7 : మహిళలు వివిధ రంగాల్లో రాణించేందుకు వారి భర్తలు, తల్లిదండ్రుల పాత్ర ప్రోత్సాహం ఉందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళా దినోత్సవ ప్రత్యేక గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించేలా ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అతిక్‌బేగం, ప్రముఖ గైనకాలజిస్ట్ శ్యామల, వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ టీ స్వప్న, మహిళా అధ్యాపకులు రేఖ, అనిత, సంతోషిని, సౌజన్య, భువన, సోని, పూనం, బోధన బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ కెడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాదవ సంఘ భవనంలో..

ఎదులాపురం, మార్చి 7 : మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని విశ్రాంత అధ్యాపకురాలు సుజాత అన్నారు. ఆదిలాబాద్‌లోని యాదవ సంఘ భవనంలో సీపీఐ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో 114వ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా దినోత్సవ ప్రత్యేకతతో పాటు ప్రస్తుతం సమాజంలో మహిళల పరిస్థితి గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు కట్ట సునీత, సంగీత, కట్ట స్వర్ణ పాల్గొన్నారు.

మహిళలకు ఆదిశక్తిగా గౌరవం

ఉట్నూర్, మార్చి 7: పూర్వికుల నుంచి మహిళలకు ఆదిశక్తిగా గౌరవం లభిస్తుందని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువును ఆపకుండా ముందుకు సాగాలన్నారు. నచ్చిన రంగంలో రాణించాలన్నారు. అనంతరం మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్, మార్చి 7: ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని రైతు వేదికలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎఫ్ ప్రోగ్రాం అధికారి దిలీప్, ఏఈవో సంధ్యారాణి, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో అనురాధ, రాధిక, ధనలక్ష్మి, రేణుక, అరుణ, జగ్గేరావు, సురేశ్, శ్రీరాం, రవికాంత్, రైతులు పాల్గొన్నారు.

ఉట్నూర్: మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో..

ఉట్నూర్, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉట్నూర్ సీడీపీవో ఉమాదేవి అన్నారు. ఉట్నూర్‌లోని సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంలో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రియాంక, ఐటీడీఏ మేనేజర్ శ్యామల, ఏఈవో జయశ్రీ, సీసీ చంద్రకళ, మంగ పాల్గొన్నారు.

నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నిర్మల్ అర్బన్, మార్చి 7: నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా పోటీని ఎదుర్కొవాలని తెలిపారు. అనంతరం మహిళా అధ్యాపకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

భైంసా, మార్చి 7 : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య అన్నారు. నిర్మల్ జిల్లా భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అదిగమించి పురోగతి సాధించినప్పుడే మనం గర్వించదగిన విషయమన్నారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ కల్పన, నహేద పాల్గొన్నారు.

యూడీఐడీపై అవగాహన కల్పించాలి

ఎదులాపురం: మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, మార్చి 7 : యూడీఐడీ కార్డు నమోదుకు దరఖాస్తు చేసుకునేలా దివ్యాంగులకు అధికారులు అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా సదరం యూడీఐడీపై సంబంధిత అధికారులు, దివ్యాంగులు, వైద్యాధికారులు, ఏపీఎంలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దివ్యాంగుల కోసం జాతీయ డేటాబేస్‌ను రూపొందించే ఉద్దేశ్యంతో యూడీఐడీ ఉప పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. యూడీఐడీ ప్రాజెక్ట్ కింద, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు నోటిపై చేసిన వైద్యాధికారుల ద్వారా దివ్యాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రాలు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. యూడీఐడీ కార్డు కోసం మొబైల్ నుంచి గాని, మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పోస్టు ద్వారా ఈ కార్డు అందుతుందని తెలిపారు. యూడీఐడీ కార్డు నమోదుపై వీవోఏ, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు గూగుల్ మీట్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో పీడీ రవీందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జై సింగ్, ఏసీడీపీవో మిల్కా, రిమ్స్ డైరెక్టర్ దివ్యాంగుల కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన

ఇంద్రవెల్లి, మార్చి 7: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హీరాపూర్ గ్రామంలోని కేజీబీవీని శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా తనిఖీ చేశారు. విద్యార్థులకు చేపడుతున్న స్క్రీనింగ్ పరీక్షలు, మధ్యాహ్న భోజనం, వంట గదిని పరిశీలించారు. వండిన వంటలకు రుచి చూసి, మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా పాఠశాలలో చేపడుతున్న వైద్య పరీక్షల విధానాన్ని పరిశీలించారు. ఎన్ని రకాల వైద్య పరీక్షలు ఉన్నాయని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు సమయం పది రోజులు మాత్రమే మిగిలి ఉందని, వారం రోజులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థినులు మంచి మార్కులు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని అన్నారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

ఇంద్రవెల్లిలోని క్రిసెంట్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా తనిఖీ చేశారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో పాటు విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువ రాజ్ మర్మాట్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియాంక, అధికారులు ఉన్నారు.

ఆరోగ్య వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా వైద్యాధికారి రాజేందర్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 7 : ఆరోగ్య వివరాలు హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. పోర్టల్ నమోదుపై డాటా మేనేజర్ శిక్షణ గంగాధర్ శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మీడియా విస్తరణాధికారి బారె రవీందర్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఇషాక్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రి డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నిరసన

నిరసనకు దిగిన విద్యార్థినులతో మాట్లాడుతున్న వీడీసీ చైర్మన్

బోథ్, మార్చి 7 : పాఠశాలలో సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ధన్నూర్(బీ) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణను పట్టించుకోవడం లేదని, కొంత మంది మద్యం తాగి వచ్చి సాయంత్రం ప్రత్యేక తరగతుల సమయంలో ఇబ్బందులకు గురిచేస్తూ చదువులకు ఆటంకం కలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడికి చెప్పినా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. నిరసన దిగిన విషయం తెలుసుకున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాఠశాలకు వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. సమస్యలు బయటకు చెప్పుకోవద్దని తమను బెదిరిస్తున్నారని విద్యార్థులు ఆవేదనతో తెలిపారు. పదో తరగతి పరీక్షల దృష్ట్యా పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని విద్యాశాఖ అధికారులను తల్లిదండ్రులు కోరుతున్నారు.

తెలంగాణ తల్లి గద్దె ధ్వంసం

కుభీర్ చౌక్‌లో ధ్వంసమైన తెలంగాణ తల్లి గద్దె

కుభీర్, మార్చి 7: నిర్మల్ జిల్లా కుభీర్‌లోని పార్డి(బీ) చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహ గద్దెను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ధ్వంసమైంది. తెలంగాణ ఉద్యమకారుడు పుప్పాల పీరాజీ, బీఆర్ఎస్ నాయకుడు వడ్నం దత్తాత్రి, గోరేకర్ కాశీనాథ్ కుభీర్ పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. త్వరలో గద్దె కూల్చివేతకు కారణమైన డ్రైవర్‌ను పట్టుకుని భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నాయకులు కోరినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

దిలావర్‌పూర్, మార్చి 7 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని టోల్‌గేట్ సమీపంలో 6 వ జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. అలకుంట మారుతి తన ఆటోలో నిర్మల్ నుంచి రాంపూర్ వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన మాక్స్ వ్యాన్ ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మారుతికి తీవ్రగాయాలు కాగా నిర్మల్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపారు. మారుతి పెద్ద కుమారుడు సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్ పరీక్షా కేంద్రంలో స్పృహ కోల్పోయిన విద్యార్థిని

కడెం, మార్చి 7: నిర్మల్ జిల్లా కడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో పెంబి మండలంలోని మందపల్లి కేజీబీవీకి చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని మణి చందన అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయింది. గమనించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు స్థానికుల సహాయంతో కడెం ప్రభుత్వ దవాఖాన తరలించి చికిత్స అందించారు. ఆమె పూర్తిగా కోలుకోవడంతో తిరిగి పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లి అనుమతి ఇప్పించాలని పోలీసులు కోరగా, అధికారులు పరీక్షకు అనుమతించారు.

290 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

జైనథ్, మార్చి 7: భారీగా అక్రమ రేషన్ బియ్యాన్ని పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని బోరాజ్ చెక్‌పోస్టు వద్ద జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్ఐ పురుషోత్తం వాహనాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని పట్టుకున్నారు. లారీలో 290 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ జీవన్‌రెడ్డి సందర్శించారు. దాని విలువ రూ.15లక్షల వరకు ఉంటుందని తెలిపారు. లారీ డ్రైవర్ తహీర్, లారీ ఓనర్ ఎండీ నజీమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

బిస్కెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఇంద్రవెల్లి, మార్చి 7: స్వయం ఉపాధితో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని ఐకేపీ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజన మిల్లెట్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ రకాల బిస్కెట్లను పరిశీలించారు. కలెక్టర్ రాజర్షి షా అధికారులతో మాట్లాడుతూ ఐకేపీ కార్యాలయానికి సంబంధించిన భూమి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల భూమి ఉంది అందులో ఎంత ఖాళీ స్థలం ఉంటుందని తెలుసుకున్నారు. ఉన్న ఖాళీ స్థలంలో గార్డెన్‌తోపాటు కూరగాయల పెంపకం, వివిధ రకాల పండ్ల మొక్కలు పెంపకంపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి, ఐకేపీ ఏపీఎం రాథోడ్ రామారావ్, మహిళా సంఘాలు, వీఏవోలు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర పుస్తక రచయితకు ప్రశంసలు


రచయితతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

భైంసా, మార్చి 7 : తెలంగాణ ఉద్యమ కారుల ముథోల్ నియోజకవర్గం చరిత్ర పుస్తక రచయిత జాదవ్ పుండలిక్ రావు పటేల్‌ను మాజీమంత్రి హరీశ్ రావు ప్రశంసించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పాటుపడిన ముథోల్ నియోజకవర్గ ఉద్యమకారుల చరిత్రను పుస్తక రూపంలో తీసుకొని రావడం అభినందనీయమన్నారు. తెలంగాణ కోసం ఎంతో మంది తమ రోజువారి పనులను వదిలేసి పోరాటంలో పాల్గొని అనేక కష్టనష్టాలను ఎదుర్కొన్నారన్నారు. ఇటువంటి త్యాగధనులను భావితరాల వాళ్లకు తెలియజేయడానికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ నాయకుడు విలాస్ గాదేవార్ ఉన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎదులాపురం, మార్చి 7: ద్విచక్ర వాహనం చోరీ కేసులు మూడు నెలలు తర్వాత బాధితుడు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గత సంవత్సరం డిసెంబర్ 22వ తేదీన ఆదిలాబాద్ చెందిన డీ రాజు సినిమా రోడ్డులోని హోటల్ పక్కన ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశాడు. తిరిగి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని దొంగలించారు. ఎక్కడ వెతికిన ద్విచక్ర వాహనం దొరకపోవడంతో శుక్రవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశ